# అంతులేని కథ

పదేళ్ళక్రితం అనుకుంటాను ఒక పార్టీలో కలిశారు మధు. అతనూ ఆ వని భార్యా, ఇద్దరు పిల్లలు. అప్పుడే ఇండియానించి వచ్చారేమో పిల్లలిద్దరూ చక్కటి తెలుగులో మాట్లాడుతుంటే ముచ్చటగా వుండేది. ఆవిడ పేరు శాంత. శాంతంగా మర్యాదగా పలకరిస్తుంటే మంచివాళ్ళన్న అభిప్రాయం వెంటనే కలిగింది. మధు అప్పుడే ఇండియానించి అమెరికా వచ్చాడు కనుక నన్నో పెద్ద దిక్కుగా భావించి సలహాలు కూడా అడుగుతున్నాడు. నాకూ మా ఆవిడకీ కూడా వాళ్ళు బాగా ఇష్టమయారు.

అతను వాటర్ అండ్ వేస్ట్ వాటర్ ఇంజనీరింగ్‌లో పోస్ట్ డాక్టర్‌గా రీసెర్చ్ చేయటానికి వచ్చాడు. రెండేళ్ళు పూర్తవగానే, ఇండియాకి తిరిగి వెళ్ళిపోవాలనుకుంటున్నాననీ, అమెరికాలో వుండిపోవటం ఇష్టంలేదనీ అన్నాడు అందుకనే కావలసిన సామానుకూడా ఎక్కువ కొనుక్కోలేదు. అతనికి నేనే కారు డ్రైవింగూ అదీ నేర్పించి ఆఫీసులో ఒకాయన పాత కారమ్ముతుంటే అతన్నో కారువాడిని చేశాను.

నాతో అప్పుడప్పుడూ అంటుండేవాడు మధు "ఇండియన్ గవర్నమెంట్ మన చదువుమీద ఎంతో డబ్బు ఖర్చుపెడుతున్నది. మంచి డిగ్రీలు తెచ్చుకున్నాక మన దేశానికి ఉపయోగపడకుండా విదేశాలకు పరుగెడుతున్నారు చాలమంది. అది దేశద్రోహం కాదూ ఎందుకు చేస్తారో అలా. డబ్బు కాపీనమేమో. ఇలా అంటున్నానని మీరేమీ అనుకోకండి" అన్నాడు.

"ఇండియాలో అవకాశాలు లేకనో, ఇక్కడ అవకాశాలు ఎక్కువనో వాళ్ళకి కావలసిన టెక్నాలజీ ఇక్కడ అందుబాటులో వుందనో వస్తూ వుండవచ్చు కదా! డబ్బు కాపీనం లేనివాళ్ళు ఎలావున్నారో, అది వున్నవాళ్ళు కూడా అన్ని చోట్లా వున్నారు. అందుకనే కదూ ఇండియాలో లక్షల్లో కట్నాలూ, లంచాలూ, బాలీవుడ్ మాఫియాలూ, పదవీ వ్యామోహాలూ, క్రికెట్ మేచ్ ఫిక్సింగులూ... "

"అలా అని నేననుకోను. నేను పై చదువుల కోసం వచ్చాను. అవి అయిపోగానే వెనక్కి వెళ్ళిపోతాను. అంతేకాదు. నాకు అమెరికన్ విధానాలు, రాజకీయాలు అస్సలు నచ్చవు" అని మధు ఆ సంభాషణ కొనసాగిస్తుంటే అడ్డం వచ్చి "మధూ! ఎవరి అభిప్రాయాలువాళ్ళవి. నేను నీతో వాదించటంలేదు నా అభిప్రాయం చెప్పాను. అలాగే రకరకాల మనుష్యులకీ రకరకాల ఆశయాలు, ఆశలు! ఆశ మానవ జీవితానికి శ్వాశ అనలేదూ ఆరుద్రగారు. అది సహజం. అందుకనే ఎవరి గురించీ నేను అంత పెద్ద మాటలు వాడను" అన్నాను.

తర్వాత సంవత్సరం తిరగక ముందే అతను నాతో అన్నాడు. "ఫలానా కంపెనీలో నాకుద్యోగం ఇస్తానన్నారు. జీతంకూడా చాల బాగుంది. కొన్నాళ్ళు

ఇక్కడే ఉద్యోగం చేసి ఆ అనుభవం కూడా చూడాలని వుంది" అన్నాడు.

ముందు కొంచెం ఆశ్చర్యపోయినా, తమాయించుకుని "శుభం. అలానే కానీ" అన్నాను.

"రెండేళ్ళు ఉద్యోగం చేస్తే మంచి అవగాహన వస్తుంది. ఇండియాకి తిరిగి వెళ్ళినప్పుడు ఉద్యోగాన్వేషణలో కూడా ఉపయోగపడుతుంది. ఇంకా అక్కడ అమెరికా గ్లామర్ తగ్గలేదు" అన్నాడు.

మధ్యేమధ్యే కలుస్తూ వున్నాం. అతను చెప్పే కబుర్లు వింటూనే వున్నాం నేనూ నా శ్రీమతీ. తన ఉద్యోగం చాల బాగుందనీ, ఎన్నో కొత్తవిషయాలు తెలుసుకుంటున్నాననీ చెప్పాడు. మధు మంచి తెలివిగలవాడు. అందుకని అతను చెప్పిన దాంట్లో ఆశ్చర్యమేమీ కనపడలేదు. కాకపోతే అతనిలో కొంచెం కొంచెం మార్పు కనపడుతున్నది. "మా కంపెనీవాళ్ళు నాకు ఇమ్మిగ్రేషన్‌కి, అదే గ్రీన్‌కార్డ్‌కి స్పాన్సర్ చేస్తామన్నారు. ఇక్కడెలాగూ వుండేది లేదు ఎందుకులే అనుకున్నాను కానీ, మళ్ళీ అనిపించింది. హెచ్‌వన్ వీసామీద ఎక్కువరోజులు వుండటానికి వీల్లేదు కదా గ్రీన్‌కార్డ్ తీసుకుంటే నష్టమేమిటిలే అనిపించింది. అందుకనే స్పాన్సర్ చేయటానికి అన్ని కాగితాలూ సంతకాలు పెట్టేసి పంపించాను"

"శుభం" అన్నాను నా మామూలు ధోరణిలో.

అతని అదృష్టమో ఏమో కాని వాళ్ళ నలుగురికీ గ్రీన్ కార్డ్ కూడా చాల తొందరగానే వచ్చింది. వాళ్ళింటికి భోజనానికి పిలిచాడు ఆ రోజు. మాటల మధ్యలో అన్నాడు, "గ్రీన్‌కార్డ్ వచ్చేసింది. ఇక ఫరవాలేదు. ఇలా అంటున్నానని అమెరికాలో సెటిలయిపోతామనుకుంటున్నారేమో. అలా అనుకుంటే పప్పులో కాలేసేరన్నమాట. వాళ్ళిస్తున్నారు. మేము తీసుకున్నాం. ఇంకో రెండు మూడేళ్ళల్లో ఎలాగూ ఇండియాకి తిరిగి వెళ్ళిపోతాం"

"అవును. అదే మంచిది. ఒకళ్ళకోసమని ఇక్కడే సెటిలయిపోం కదా! నీకూ నీ కుటుంబానికీ ఏది మంచిదనిపిస్తే అదే చెయటం మంచిది... " అన్నాను.

ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు శ్రీమతి అంది, "ఎందుకలా ఆయన చేస్తున్న ప్రతి పనిని తనే సమర్థించుకుంటాడు. ఇక్కడే వుండిపోవాలనుకుంటే వుండటమే. ఇక్కడ ఎవరూ ఆయన్ని కొట్టి వెనక్కి వెళ్ళమనటం లేదు. ఉండమనటం లేదు. ఆయన జీవితం. ఆయన ఇష్టం. దాన్ని అలా సమర్థించుకోవాల్సిన అవసరం లేదే"

"అతను సమర్థించుకుంటున్నది మన కోసం కానీ, మిగతా వాళ్ళ కోసం అని కానీ నేను అనుకోవటంలేదు. అది పూర్తిగా తన మనసుని నమ్మించటం కోసం అతనే చేసుకుంటున్న ప్రయత్నం అనిపించింది నాకు" అన్నాను.

తర్వాత ఒకసారి కలిసినప్పుడు "మీకు తెలిసిన రియల్ ఎస్టేట్ ఏజెంట్ ఎవరయినా వున్నారా? మా ఆవిడకి స్వంత ఇంట్లో వుండాలనే కోరిక ఎక్కువయిపోయింది" అన్నాడు నవ్వుతూ.

"నాకా కోరిక మీకా" అంది శాంత, శాంతంగా నవ్వుతూ.

"ఎందుకూ ఇల్లు కొనుక్కోవటం, ఎలాగూ ఈ సంవత్సరం దుకాణం ఎత్తే

స్తున్నావుకదా" అని నేనుకానీ శ్రీమతికానీ అనలేదు. అతని ఎజెండా అదనిది. అడిగితే సలహా ఇవ్వాలి కానీ, నిర్ణయం తీసుకుని చెబుతున్నప్పుడు సలహా ఇవ్వటం కాదు చేయవలసింది. అడిగిన సహాయం చేయటం. అందుకే ఫలానా మైక్, కెవిన్‌ల ఫోన్ నెంబర్లిచ్చి "నాకు వాళ్ళు బాగా తెలుసు. నా పేరు చెప్పు. నీకు పర్సనల్ ఎటెన్షన్ ఇస్తారు" అన్నాను.ముందే చెప్పానుగా మధు తెలివైనవాడని. అంతేకాదు అనుకున్నది సాధి స్తాడు కూడాను. అందుకనే మూడు నెలల్లో గృహ ప్రవేశానికి పిలిచాడు.

ఆ రోజు అందరి ముందూ అన్నాడు "మేమేదో ఇల్లు కొనుక్కుంటున్నామని ఇక్కడే వుండిపోతామనుకోకండి. మాకిక్కడ అసలేమాత్రం నచ్చలేదు. ఇంకో రెండేళ్ళల్లో ఇండియాకి వెళ్ళిపోతున్నాం. ఊరికే ఈ కొత్తింటి సరదా చూద్దామని కొన్నామంతే!"

అతనామాట అన్నప్పుడు ప్రకాష్ అన్నాడు "రెండేళ్ళల్లో వెనక్కి వెళ్ళిపోయేటప్పుడు కొనటమెందుకండీ! మళ్ళీ అమ్మటం కష్టమవుతుంది ఈ ఎకానమీలో. కావాలంటే ఇలాటి ఇళ్ళు అద్దెకి దొరుకుతాయి కదా" అని. అతని మాటలు మధు పట్టించుకున్నట్టులేదు. అమెరికన్ ఎకానమీ ఎందుకు బాగాలేదో ఎంత బాగాలేదో చెబుతున్నాడు. నేను మాట్లాడకుండా సాంబారులో చపాతీలు నంచుకుంటూ వాళ్ళ మాటలు వింటున్నాను.

తర్వాత రెండేళ్ళయిందేమో, ఒకరోజున ఫోన్ చేశాడు మధు. అలా ఫోన్ చేసి మాట్లాడటం మామూలే కనుక "ఏమిటి విశేషం. ఇండియాకి తిరుగు ప్రయాణం కడుతున్నారా?" అన్నాను నవ్వుతూ.

మధు అదోలా నవ్వి "అదికాదు. మిమ్మల్నో విషయమడగాలి. అమెరికన్ సిటిజెన్‌షిప్‌కి అప్లయ్ చేస్తున్నాం మా అందరికీ. మొత్తం ప్రాసెసింగ్‌కి ఎన్నాళ్ళు పడుతుందంటారు?" అని అడిగాడు.

ఇలాటిమాట ఎప్పుడో ఒకప్పుడు వింటానని తెలుసుగానీ, అంత త్వరగా వస్తుందనుకోలేదు. అయినా నా ధోరణిలో అతన్నేమీ ప్రశ్నించకుండా "నేను సిటిజన్‌షిప్ తీసుకుని చాల ఏళ్ళయింది. అప్పటికీ ఇప్పటికీ చాల తేడావుంది. నువ్వు ఈ మధ్య అప్లయ్ చేసినవాళ్ళని అడిగితే,లేటెస్ట్ ఇన్ఫర్మేషన్ వస్తుంది. రామారావ్‌గార్ని అడిగి చూడు" అన్నాను.

"అలాగే! నేను అమెరికాలో వుండిపోవటానికి సిటిజన్‌షిప్ తీసుకోవటం లేదు. బిజినెస్ ట్రిప్పుల మీద యూరప్ కానీ జపాన్ కానీ, ఇండియన్ పాస్‌పోర్ట్‌తో వెడితే మళ్ళీ వీసాలు తీసుకోవాలి. అమెరికన్ పాస్‌పోర్టయితే అక్కర్లేదు. అందుకని" అన్నాడు మధు. నాకు తెలుసు మధు తనని తను సమర్థించుకోవటంలో సమర్థుడని.

అందుకే "అవును నువ్వు చెప్పింది నిజమే" అని వెంటనే ఒప్పేసుకున్నాను ఈ కథ కంచికి వెడుతుందా కాలిఫోర్నియాకి వెడుతుందా, ఎక్కడికి వెళ్ళినా ఎప్పుడు వెడుతుందీ అని ఆలోచిస్తూ.